క్లుప్తంగా

ఎమ్మెల్యే రాక రేపు

కొయ్యూరు: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు శనివారం కొయ్యూరులో పర్యటిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు.

వినాయక చవితి ఉత్సవాలకు పందిరిరాట



వినాయకచవితి ఉత్సవాలకు పందిరి రాటను వేస్తున్న గ్రామస్తులు

జి.మాడుగుల: మండలంలో మారుమూల కిముడుపల్లి గ్రామంలో వినాయచవితి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు పందిరిరాట వేశారు. ఈ ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేస్తుంది. ఉత్సవ కమిటీ నిర్వాహకులు బాబూరావు, లింగమూర్తి, కృష్ణవేణి, బలరాం, లక్ష్మి, బుజ్జిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన



షిర్డీసాయిబాబా ఆలయం వద్ద అన్నదానంలో భక్తులు

రాజవొమ్మంగి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో గురువారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి అశేషంగా భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు పురోహితుడు భానుమూర్తి తెలిపారు. సాయంత్రం ప్రత్యేక హారతి, భజన కార్యక్రమాలు జరిగినట్టు చెప్పారు.


ఉన్నత విద్యపై దృష్టి సారించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి

అరకులోయ రూరల్: విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని అరకు సీఐ హిమగిరి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పరివర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిషత్ చదువుపైనే ఆధారపడి ఉంటుందన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌ఐ సంతోష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ



శిక్షణ పొందుతున్న యువత

అరకులోయ రూరల్: గిరిజన యువతకు డిజిటల్ నాలెడ్జ్‌పై శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలోని నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన శిక్షణ తరగతుల సందర్భంగా సంస్థ కో–ఆర్డినేటర్ రవి మాట్లాడుతూ కంప్యూటర్ పరిజ్ఞానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ సంస్థ ద్వారా విడతల వారీగా డిజిటల్ సేవలు, గిరిజన హక్కులు, చట్టాలు తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామనారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అద్దు, సింహాచలం, శాంతి, శైలజ, కొండప్ప, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తమెన్నడో?

- పూర్తయిన గిరిజన బజార్ భవనాలు
- ఒక్కో భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేసిన గత ప్రభుత్వం
- అందుబాటులో తీసుకురావాలంటున్న గిరిజన మహిళలు



బరడలో పూర్తయిన బజార్ భవనం

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్దే లక్ష్యంగా గిరిజన ప్రాంతాల్లో దొరికే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు, అమ్మకాలు చేయడం కోసం ఐటీడీఏ ద్వారా హత్ బజార్ల నిర్మాణానికై గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. హట్ బజార్లు ఏర్పాటు చేయడం వల్ల గిరిజన రైతులకు మార్కెటింగ్ వెసులుబాటు కావడంతో డ్వాక్రా సంఘాల్లో మహిళలు మార్కెటింగ్ రంగంలో వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంది. మండలంలో ప్రస్తుతం ట్రైబల్ వెల్ఫేర్ హట్ బజార్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కో హట్ బజార్ నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా రూ.5 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఈ మేరకు మండలంలోని కించాయిపుట్టు, బరడ, లక్ష్మీపురం పంచాయతీల్లో హత్ బజార్ల నిర్మాణాలు పూర్తి చేశారు.అందుబాటులోకి వస్తే గిరిజన రైతులు సేకరించే పసుపు,రాజ్మా,అడ్డాకులు,చింతపండు వంటి పలు అటవీ,వ్యవసాయ ఉత్పత్తులను డ్వాక్రా సంఘాల మహిళలు కొనుగోలు చేసి హత్ బజార్ల భవనంలో నిల్వ చేసి కేజీలు,ప్యాకెట్‌లు రూపంలో అమ్మకాలు చేస్తారు. దీంతో డ్వాక్రా మహిళలు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు సంఘం బలోపేతానికి ఎంతో ఉపయోగపడుతుంది. హట్ బజార్లు వినియోగంలోకి వస్తే చాలా ఉపయోగకరంగా ఉంటాయని గిరిజన రైతులతో పాటు డ్వాక్రా మహిళలు ఆశగా ఎదురు చూస్తున్నారు. నిర్మాణాలు పూర్తి నెలలు గడుస్తున్నా ప్రారంభం కాకపోవడంపై మహిళ సంఘాలు మండిపడుతున్నాయి. వెంటనే ప్రభుత్వం, అధికారులు స్పందించి హట్ బజార్లు ప్రారంభించాలని మహిళాలు కోరుతున్నారు.

భవనాలు ప్రారంభించాలి



హట్ బజార్ మంజూరు వల్ల డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ఆస్కారం ఉంది. స్థానికంగా గిరిజన రైతులు సేకరించే వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి అమ్మకం చేయవచ్చు. ముఖ్యంగా పసుపు కొమ్ములు కొనుగోలు చేసి. పొడ్‌గా చేసి ప్యాకెట్లు రూపంలో విక్రయిస్తే మంచి లాభాలు వస్తాయి. హట్ బజార్ల నిర్మాణాలు పూర్తయిన ప్రారంభించకపోవడం దారుణం, వెంటనే ప్రభుత్వం,అధికారులు స్పందించి ప్రారంభించాలి. – ఎస్.భాగ్యవతి, సర్పంచ్, జర్రెల పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ఉన్నతాధికారులకు నివేదించాం



మండలంలో వేగంగా హట్ బజార్ల నిర్మాణాలు పూర్తి చేయడం జరిగింది. ఒక్కో భవన నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరయ్యాయి. 300 మంది డ్వాక్రా మహిళలతో హట్ బజారు నిర్వహణ జరుగుతుంది. హట్ బజార్ల ప్రారంభంపై ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. వారి నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ప్రారంభిస్తాం. – ఎ.దేవమంగ, వెలుగు ఏపీఎం, ముంచంగిపుట్టు మండలం.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

హుకుంపేట/ముంచంగిపుట్టు/కొయ్యూరు/రాజవొమ్మంగి/వై.రామవరం/ : జిల్లా వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు తదితరులు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత హాకీ ఒలింపిక్ ఆటగాడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. విద్యార్థులో చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యానచంద్ సేవలు చిరస్మరణీయమన్నారు. క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు క్రీడా రంగంపై కూడా ఆధార పడి ఉన్నాయన్నారు. ముంచంగిపుట్టులో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యారావు తదతరులు పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయభారతి ఆధ్వర్యంలో జరిగిన క్రీడా దినోత్సవంలో పాల్గొన్న ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో రాణించడం ద్వారా దేశానికి, సొంత గ్రామానికి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావచ్చన్నారు. ఆయా క్రీడల్లో రాణిస్తున్న వారిని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తే జాతీయస్థాయికి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులను అభినందించారు.దీనిలో ఎంపీటీసీ నాగలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వల్లి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2లో జరిగిన వేడుకలో తెలుగు అధ్యాపకుడు శ్రీనివాసరావు, పీడీ రాంబాబులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయలు భీమన్న కృష్ణారావు, సుందరమ్మ ,ప్రసన్నకుమార్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: డీఏవీ పాఠశాల జరిగిన వేడుకలో హెచ్‌ఎం కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు వేషధారణ ఆకుట్టుకుంది. ఇటీవల రాష్ట్ర స్థాయి పోటిలకు ఎంపికైన పదో తరగతి విద్యార్థి ఎస్‌కె.అమీర్‌బాషాను అభినందించారు. 5వ తరగతి విద్యార్థి సుయిసుచేతన్ ప్రదర్శించిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం పలువురిని ఆకర్షించింది.



హుకుంపేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం బాలాజీ తదితరులు



క్రీడాకారులతో ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య, ప్రిన్సిపాల్ విజయభారతి తదితరులు



ఉపాధ్యాయులు శ్రీను, రాంబాబులను సన్మానిస్తున్న హెచ్‌ఎం సత్యారావు తదితరులు

హైందవ ధర్మంపై ప్రచారం



మాట్లాడుతున్న కుమార్‌రావు స్వామిజీ

రాజవొమ్మంగి: హైందవ ధర్మాన్ని కాపాడేందుకు అందరు ఏకతాటిపైకి రావాలని విశ్వహిందూ పరిషత్ అల్లూరి జిల్లా అధ్యక్షుడు కుమార్‌రావ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక షిర్డీ సాయిబాబా మందిరంలో జరిగిన ఆధ్యాత్మిక సమావేశంలో హైందవ ధర్మం ప్రాధాన్యతను స్థానికులు వివరించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు హిందూ సమాజం మేల్కొనాలని కోరారు. అనంతరం జరిగిన భారీ ర్యాలీలో భక్తులు పాల్గొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ డివిజన్ ప్రచారక్ విశ్వనాథరెడ్డి, పురోహితులు భానుమూర్తి, ప్రఖండప్రముఖ్ గుప్తా, త్రిమూర్తులు, వంశీ, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సీఐ హిమగిరికి సన్మానం



సీఐ హిమగిరిని సన్మనిస్తున్న ప్రజాప్రతినిధులు

డుంబ్రిగుడ: అరకులోయ నూతన సీఐ హిమగిరిని స్థానిక ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, లలీత గురువారం కలిశారు. శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతర సీఐగా బాధ్యతలు తీసుకున్న హిమగిరి గతంలో డుంబ్రిగుడ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించారని, అందరికి సూపరిచితమైన వ్యక్తిగా అరకులోయ సర్కిల్ సీఐగా రావడం ఎంతో ఆనందగా ఉందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు విజయ, పద్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణరావు, సింహాచలం, చిరంజీవి, నరేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల నిరసన



నిరసన తెలియజేస్తున్న సర్పంచులు

ముంచంగిపుట్టు: గ్రేడ్ 4,5 కార్యదర్శులను మైదాన ప్రాంతాలో బదిలీ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని,గిరిజన ప్రాంతంలోనే ఉంచాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల సర్పంచులు నిరసనకు దిగారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యలయం ఎదుట నిరసన చేశారు.ఈ సందర్భంగా సర్పంచులు రమేష్,త్రినాథ్,లక్ష్మణ్‌లు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 ప్రతిపాదికన సచివాలయంలో 100శాతం నియామకాలు జరిగాయని,గత ఐదు సంవత్సరాలు గిరిజన ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ మంచి సేవలు అందించారని,వీరిలో మూడు సంవత్సరాలు పూర్తి చేసిన వారిని ఉద్యోగ పదోన్నతి కలిపించాలని కాని చేయలేదని,గిరిజన ప్రాంతంలో మైదాన ప్రాంతం నుంచి వచ్చిన ఉద్యోగులు భాషా పరమైన ఇబ్బందులు పడుతున్నారని,దీంతో గిరిజనులు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని,గిరిజన ప్రాంతంలో ప్రస్తుతం పని చేస్తున్న గిరిజన కార్యదర్శులను కొనసాగించాలని,ప్రభుత్వం ఇచ్చిన బదిలీ ఉత్తర్వులు రద్దు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు సుబాష్‌చంద్ర,బాబురావు,నీలకంఠం,శివశంకర్,నర్సింగరావులు పాల్గోన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఉత్సవం



అప్పలరాజుపేటలో ఘటాల ఊరేగింపులో భక్తులు

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో గురువారం రాత్రి గ్రామదేవత మరిడమ్మ తల్లి పండుగను భక్తులు గిరిజన ఆచార సాంప్రదాయాల ప్రకారం ఘనంగా నిర్వహించారు. ఊరి పొలిమేరల్లో ఓ చెట్టు కింద కొలువై ఉన్న మరిడమ్మ తల్లి ఆలయం వద్దకు వెళ్లి పూజలు చేశారు. అంతకు ముందు ఉదయం నుంచి ఉపవాసంతో ఉన్న చిన్నారి తలపై అమ్మవారి గరగ ఘటాన్ని ఉంచి ఊరంతా ఊరేగించారు. అమ్మవారికి దారి పొడవునా దీపదూపాలతో పూజలు చేస్తూ ముందుకు కదిలారు. మార్గమధ్యలో భక్తులు పూనకాలతో అమ్మవారి డప్పువాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఆలయం వద్దకు వచ్చిన తరువాత చెట్టు క్రింద ఘటాన్ని ఉంచి పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలు, గాజులు, పూసలు, పసుపు కుంకుమ రకరకాల పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు. వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని ఏటా ఈ పండుగను జరుపుకొంటారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వై.రామవరం: మండల కేంద్రం వై.రామవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాలాల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ యూసుఫ్, డీఈఈ దివాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్‌ల మరమ్మతులతో పాటు తీగలపై వేలాడే చెట్ల కొమ్మల తొలగింపు పనులు కారణంగా నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

అనాథాశ్రమాలు, గురుకులాల్లో తనిఖీలు

నెల్లిపాక/ఎటపాక: మండలంలోని పలు అనాథ శరణాలయాలను, గురుకుల పాఠశాలలను సీఐ పిన్నింటి రమణ, సీడీపీవో లలిత్ కమారి తదితరుల బృందం గురువారం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఇటీవల కోటవురట్లలోని ఆశ్రమ వసతిగృహంలో విద్యార్థులు కలుషితాహారం తిని, అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. మండలంలోని బోదువలస రిషి గురుకులం, దేవీపురంలోని డాన్ బాస్కో వసతి గృహం, వెదుళ్లనరవలోని చిల్డ్రన్ అఫ్ పెయిత్ వసతి గృహాల వంట గదులను, సరకులను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలిచ్చారు. వీరి వెంట డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, వీఆర్వో వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



పాడేరులోని కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, సిబ్బంది





చౌడుపల్లి, అనంతగిరి మండలాల్లో పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది



మర్రిపాలెంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు



డీఏవీ పాఠశాలలో వేషధారణలో ఆకట్టుకుంటున్న విద్యార్థులు

అనంతగిరి(అరకులోయ రూరల్): జిల్లా వ్యాప్తంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాలలు, పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో తెలుగు భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు తదితరులు మాట్లాడుతూ తెలుగు భాష ఔనత్యాన్ని చాటిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని కొనియాడారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగును వచనంగా మార్చి ప్రజలకు వాడుక బాసగా చేసిన ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. వ్యవహరిక భాష ఉద్యమానికి ఆయన మూలపురుషుడని కొనియాడారు. తెలుగు భాష తల్లి వంటిదని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులకు తెలుగు భాష పట్ల మక్కువ ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తెలుగు భాషను గౌరవించి, వాటి కీర్తిని చాటాదామని పిలుపునిచ్చారు. అనంతగిరిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో–2లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు తెలుగు కవుల వేషధారణలో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్‌ఎం మంగమ్మ, హెచ్‌డబ్ల్యూవో రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలోని చౌడుపల్లిలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.కాంతారావు, ఉపాధ్యాయులు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాళ్లు బి.కృష్ణ, మోహన్, అధ్యాపకులు మంగమ్మ, కుమారి, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రాజుబాబు, డాక్టర్ పుష్ప, డాక్టర్ శ్రీనివాస్, వెంకటరమణ, శేఖర్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులోని జరిగిన వేడుకల్లో హెచ్‌ఎం కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ వి.శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో జరిగిన వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వె.రామవరం: మండలంలోని జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



బోర్నగూడెంలలో జరిగిన వేడుకలో పాల్గొన్న హెచ్‌ఎం తదితరులు



పి.యర్రగొండలో టీచర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

సమావేశాల్లో సమస్యల వెల్లువ

- అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ధ్వజం
- అనంతగిరి, ఎటపాకలలో మండల సమావేశాలు



ఇసుక అక్రమ రవాణాపై అధికారులను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ మంగేశ్వరరావు



అనంతగిరిలో మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

అనంతగిరి(అరకులోయ రూరల్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ శెట్టి నీలవేణి చెప్పారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నీలవేణి మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత సమావేశంలో తీర్మాణం చేసిన్న అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులు దృష్టి సారించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

గుమ్మకోట గురుకులం పాఠశాల నిర్వహణ తీరుపై ఎంపీపీ నీలవేణి, జెడ్పిటీసీ సభ్యుడు గంగరాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ప్రోటోకల్ లేకుండా ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నరన్నారు. గతం నుంచి కూడా నిర్వహణపై పలు ఆరోపణలు ఉందన్నారు, విద్యార్థులకు సరుకులు సరఫరా చేస్తున్న వెండర్ విధానంపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేపట్టాలన్నారు. మండల పరిధిలో విద్యా వ్యవస్థ అధ్వానంగా మారిందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని దీంతో విద్యా వ్యవస్థ కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. మండల కేంద్రంలోనే అందుబాటులో ఉండి వివిధ ప్రాంతలకు 104 సేవలు విస్తృతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తెలిపారు. సర్వసభ్య సమవేశానికి గైర్హాజరైన పినకోట,భీమవరం వైద్యాధికారులు, గిరిజన సంక్షేమ ఇంజనీర్ అధికారులపై చర్యలకు చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మాణం చేశారు, ఎంపీడీవో నగేష్, డిప్యూటీ తహసీల్దార్ మాణిక్యం, ఎంఈవో బాలాజీ, వైస్ ఎంపీపీలు జయవర్ధని, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: సమస్యలపై అధికారులను నిలదీసిన ఘటన గురువారం జరిగిన ఎటపాక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో చోటుచేసుకుంది. ఎంపీపీ కాక కామేశ్వరి అధ్యక్షతన సమావేశం జరగగా ప్రారంభం నుండి ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై గళమెత్తారు. వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ గుండాల ఇసుక స్టాక్ పాయింట్ నుంచి ఇసుక అక్రమ రవాణాలో అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్టు ఆరోపణలున్నాయన్నారు. టిప్పర్ల లారీల్లో ఇసుక లోడు చేస్తున్నారని వాటిని తెలంగాణాకు ఇసుకను తరలిస్తున్నారన్నారు. పనులు ఎందుకు పూర్తి చేయలేదని పలువురు ప్రశ్నించారు. వచ్చే సమావేశంలోగా పెండింగ్ పనులు పూర్తి చేస్తామని అధికారులు వివరణ ఇచ్చారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఉబ్బా సుస్మిత, ఎంపీడీవో రామాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ పృథ్వీ, ఎంఈఓలు రాజులు, లక్ష్మీనారాయణ, సీడీపీవో విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.